## క్లుప్తంగా

### పాఠశాల తనిఖీ



ఆగిరిపల్లి: స్థానిక కొండ కాలనీలోని మోడల్ ప్రైమరీ స్కూల్‌ను, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ బి.భార్గవి మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలకు హాజరైన విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో వసతులపై ఆరా తీసి రికార్డులు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద ములగ, తోటకూర మొక్కలు నాటాలని సిబ్బందికి సూచించారు. ఆమెతో పాటు ఎంఈఓలు సర్వేశ్వరరావు, ఆనంద్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పాఠశాలకు కంప్యూటర్ వితరణ



తిరువూరు: ఎ.కొండూరు మండలం కోడూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. రాంప్రదీప్ మంగళవారం కంప్యూటర్‌ను అందచేశారు. తన తండ్రి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం విద్యార్థులకు ఉపయోగపడే విధంగా కంప్యూటర్‌ను అందించానని ఆయన తెలిపారు. పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు కె. రాంబాబు చేతుల మీదుగా కంప్యూటర్‌ను పాఠశాలకు అందజేశారు.

### ప్రభుత్వ ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్‌గా రజిత



నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌గా పైడిమాల రజిత నియమితులయ్యారు. ఏలూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న రజిత నూజివీడు ఐటీఐ కళాశాలకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న దేవరకొండ భూషణం ఏలూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు బదిలీ అయ్యారు. విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు లభించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ప్రిన్సిపాల్ రజిత తెలిపారు.

### పచ్చిరొట్ట ఎరువులతో భూమికి మేలు



చాట్రాయి: పచ్చి రొట్ట ఎరువులు భూమికి ఎంతో మేలు చేస్తాయని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఉషారాణి అన్నారు. మండలంలోని తుమ్మగూడెం గ్రామంలో పచ్చి రొట్ట సాగును మంగళవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. జీలుగ, జనుము, పిల్లి పెసర వంటి పచ్చి రొట్ట ఎరువులతో భూమిలో సేంద్రియ పదార్థాలు పంటలకు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. భూమిలో నత్రజని పెరిగి చవుడును తగ్గిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి బి.శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

### దోమతెరలు పంపిణీ



విస్సన్నపేట: సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర స్థానిక శివాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు మంగళవారం నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వీధుల్లో రథయాత్ర సాగింది. స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు దోమతెరలు, పాదరక్షలు, ప్రసాదాలు పంపిణీ చేశారు.

### దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేత

ఆగిరిపల్లి: తోటపల్లి హీల్ సంస్థలో మంగళవారం ఇద్దరు దివ్యాంగులకు ఎస్‌బీఐ పెన్షనర్స్ క్లబ్-200 విజయవాడ వారి ఆర్థిక సాయంతో కృత్రిమ కాళ్లను అందజేశామని హీల్ సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్ తెలిపారు. ఎస్‌బీఐ పెన్షనర్స్ క్లబ్ ముఖ్య సభ్యులు ఎస్.రామకృష్ణ, తుమ్మల భోగేశ్వరరావు పాల్గొన్నారు.

### బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

నూజివీడు: మండలంలోని అన్నవరం హైస్కూల్‌లో పనిచేసి ఇటీవల బదిలీపై వేరే పాఠశాలకు వెళ్లిన ముగ్గురు ఉపాధ్యాయులను మంగళవారం పాఠశాలలో సన్మానించారు. గణిత ఉపాధ్యాయిని జీవన జ్యోతి, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ప్రవీణ్, పీఈటీ ఆరతిలను హెచ్‌ఎం జి.విజయకుమారితో పాటు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

# మురుగుతో సహవాసం

- కనిపించని డ్రెయినేజీలు
- రోడ్లపైకి చేరుతున్న మురుగునీరు
- పారిశుద్ధ్య లోపంతో ప్రబలుతున్న వ్యాధులు
- వెలగలేరు కాలనీ వాసుల ఇబ్బందులు



వెలగలేరు శివారు కాలనీలో రోడ్డుపై చేరిన మురుగునీటిని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జి.కొండూరు: కాలనీ ఏర్పడి పాతికేళ్లైంది. సీసీ రోడ్లు అయితే వేశారు. మురుగునీరు పోయేందుకు మార్గం మాత్రం చూపలేకపోయారు. డ్రెయినేజీలు లేక ఎక్కడి మురుగు అక్కడ నిలిచిపోయి దుర్వాసన, వ్యాధులతో ఆ కాలనీ వాసులు సహవాసం చేయాల్సి వస్తోంది. ఓట్ల కోసం కాలనీకి వచ్చే ప్రజా ప్రతినిధులు ఆ తర్వాత కాలనీ వైపు కన్నెత్తి చూడడం లేదు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మురుగుతో వెలగలేరు శివారు కాలనీ వాసులు నరకయాతన పడుతున్నారు.

### పాతికేళ్లుగా..

వెలగలేరు శివారులోని హైస్కూల్ పక్కన పాతికేళ్ల కిందట కాలనీ ఏర్పడింది. ఈ కాలనీలో 150 కుటుంబాల వరకు ఉండగా 600లకు పైగా జనాభా నివసిస్తున్నారు. ఈ కాలనీలో ఒక ప్రధాన రహదారి, ఆరు అంతర్గత రహదారులు ఉన్నాయి. వీటన్నింటిని సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశారు తప్ప డ్రెయినేజీలు నిర్మించలేదు. కాలనీలో మురుగు నీరు పోయే మార్గం లేక ఎక్కడికక్కడ నిలిచిపోయి రహదారులపైకి వస్తోంది. ఇక వర్షం పడిన సమయంలో మురుగునీరు, వర్షం నీరు కలిసి ప్రవహించి ఇళ్లల్లోకి సైతం చేరుతోంది. మురుగునీరు నెలల తరబడి నిల్వ ఉండటంతో దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. కాలనీ వాసులు విష జ్వరాలు, వ్యాధుల బారిన పడుతున్నారు.

### పరిశీలించిన వైఎస్సార్ సీపీ నాయకులు

కాలనీలో డ్రెయినేజీ సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు పార్టీ గ్రామ అధ్యక్షుడు యర్రగుంట సుకుంద్ ఆధ్వర్యంలో మంగళవారం కాలనీని సందర్శించారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని డ్రెయినేజీ సమస్యపై త్వరలో స్థానికులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని నాయకులు తెలిపారు.

### నరకయాతన పడుతున్నాం



కాలనీలో డ్రెయినేజీ సమస్యతో నరకయాతన పడుతున్నాం. మురుగునీరు పోయే మార్గం లేక రోడ్ల పైకి వస్తోంది. ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలు పెరిగి వ్యాధులు వ్యాపిస్తున్నాయి. అధికారులు స్పందించి మురుగునీరు పోయే మార్గం చూపాలి

– గౌరై నారాజు, స్థానికుడు, వెలగలేరు శివారు కాలనీ

### రోడ్లపైనే మురుగునీరు



మా కాలనీలో డ్రెయినేజీలు లేక మురుగునీరు రోడ్ల పైకి వస్తోంది. వర్షం పడిన సమయంలో మురుగునీరంతా వర్షం నీటితో కలిసి ప్రవహిస్తోంది. ఈగలు, దోమలు పెరిగిపోయి నరకయాతన పడుతున్నాం. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి

– అరవింద్ నాయక్, స్థానికుడు, వెలగలేరు శివారు కాలనీ

### కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం



కాలనీలో డ్రెయినేజీ సమస్యతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి డ్రెయినేజీలు నిర్మించాలి. త్వరితగతిన మురుగునీరు పోయే మార్గం చూపి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. లేకుంటే త్వరలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

– యర్రగుంట సుకుంద్, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు, వెలగలేరు

## గుంతలమయంగా ఆర్ అండ్ బీ రహదారి

రాకపోకలకు ప్రయాణికుల ఇబ్బందులు



మైలవరం- నూజివీడు రహదారిలో ఏర్పడిన గుంతలు

మైలవరం: మైలవరం నుంచి నూజివీడు, రెడ్డిగూడెం మీదుగా విస్సన్నపేట వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి గుంతలమయంగా మారింది. ఈ రహదారిలో ప్రతి నిత్యం వందలాది వాహనాలతో పాటు విజయవాడ నుంచి రెడ్డిగూడెం మీదుగా విస్సన్నపేట, మైలవరం నుంచి వెల్వడం, చంద్రాల మీదుగా నూజివీడు వెళ్లే ఆర్టీసీ బస్సులు 40 ట్రిప్పులు తిరుగుతుంటాయి. వివిధ గ్రామాల నుంచి మైలవరం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వచ్చే విద్యార్థులు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ రోడ్డుపై ప్రయాణిస్తుంటారు. వాహనాలు గుంతలలో పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహన యజమానులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో గుంతల్లో వర్షం నీరు నిలిచి గుంతలు కూడా కన్పించని పరిస్థితి నెలకొంది. ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

### మరమ్మతులు చేపట్టాలి

మైలవరం నుంచి నూజివీడు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డులో ప్రతి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా వివిధ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు గుంతలమయంగా ఉన్న రహదారితో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలి.

– పి. సూర్యతేజ, గ్రామస్తుడు, మైలవరం

## సెల్ టవర్ పనులను అడ్డుకున్న గ్రామస్తులు



సెల్ టవర్ పనులపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న స్థానికులు

జి.కొండూరు: స్థానికంగా ఆత్కూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేయనున్న సెల్ టవర్ పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఆత్కూరు రోడ్డు పక్కన మండల వ్యవసాయాధికారి కార్యాలయానికి సమీపంలోని ప్రైవేటు భూమిలో గతంలో ఏర్పాటు చేసిన సెల్ టవర్ పక్కన మరో టవర్ ఏర్పాటుకు మంగళవారం పనులను ప్రారంభించారు. స్థానికులు అక్కడకు చేరుకుని పనులను నిలిపివేయాలని సిబ్బందిని కోరారు. స్థానికులు మాట్లాడుతూ ఇప్పటికే ఉన్న సెల్ టవర్ రేడియేషన్‌తో తాము అనారోగ్యం పాలవుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు మరో టవర్‌ని ఏర్పాటు చేస్తే తాము ఇళ్లు వదిలి పోవాల్సి వస్తోందని మండిపడ్డారు. టవర్‌కి సమీపంలోనే ప్రైవేటు పాఠశాల కూడా ఉన్నందున రేడియేషన్ ఎఫెక్ట్‌తో విద్యార్థులంతా అనారోగ్యం పాలవుతారన్నారు. ఈ సమస్యపై సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. సర్పంచ్ మండల అరుణ ఘటనా స్థలానికి చేరుకొని టవర్ ఏర్పాటుకు గ్రామ పంచాయతీలో తాము ఎటువంటి తీర్మానం చేయలేదని చెప్పారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఇరువర్గాలను పోలీసుస్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు.

## అంబేడ్కర్‌ను దూషించారని ఫిర్యాదు



తిరువూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



విస్సన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తిరువూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను దూషిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టింగులు పెట్టిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ నాయకులు మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంబేడ్కర్‌ను, దళితులను కించపరుస్తూ ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో సుధీర్‌బాబు అనే వ్యక్తి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, రాజ్యాంగాన్ని సైతం అవమానించిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఎస్‌ఐ లక్ష్మీకి ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ సీపీ మండల, పట్టణ అధ్యక్షులు తాళ్లూరి నవీన్‌కుమార్, చలమాల సత్యనారాయణ, లీగల్ సెల్ కన్వీనర్ రేగళ్ల మోహన్‌రెడ్డి, తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఆంజనేయపురం, కొమ్మిరెడ్డిపల్లి గ్రామ సర్పంచులు మామిడి కుటుంబరావు, బంకా వెంకటేశ్వరరావు, చింతలపాడు మాజీ సర్పంచి బండారు పద్మావతి, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ ఇన్‌చార్జి యరదేశి రామారావు, మైనారిటీ నాయకులు షేక్ జాకీర్, నాయకులు పాల్గొన్నారు.

విస్సన్నపేట: ఇన్‌స్టాగ్రామ్‌లో సుధీర్‌బాబు అనే వ్యక్తి భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను, దళితులను దూషిస్తూ అసభ్యకర పదజాలంతో పోస్టులు పెట్టాడని, అతడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నాయకుడు సిరసాని ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఓలేటి దుర్గారావు, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యుడు జి. మల్లయ్య, నాయకులు కోపల్లి జయకర్, ముంగా జయరాజు, పల్లెపాం లక్ష్మయ్య, తానంకి రాంబాబు, దస్తగిరి, కాలేషా, అలీరహమాన్, బడుగు భాస్కరరావు, మంగయ్య, విక్రమ్ పాల్గొన్నారు.

## అడవి క్వారీ పాఠశాలను యథాతథంగా కొనసాగించాలి

సీఐటీయూ నాయకులు, తల్లిదండ్రులు డిమాండ్



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, తల్లిదండ్రులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి అడవి క్వారీలోని ఎంపీయూపీ పాఠశాలను యథాతథంగా కొనసాగించాలని సీఐటీయూ నాయకులు, తల్లిదండ్రులు కోరారు. ఎంపీయూపీ స్కూల్‌ను ఎంపీపీ పాఠశాలగా మార్పు చేయదాన్ని నిరసిస్తూ తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి సీఐటీయూ నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం.మహేష్, మాట్లాడుతూ అడవి ప్రాంతంలో క్వారీలు, వివిధ ప్రైవేట్ కంపెనీల కార్మికుల పిల్లలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో గతంలో ఇక్కడ ఎంపీయూపీ పాఠశాలను ఏర్పాటు చేశారన్నారు. ఇటీవలి కాలంలో డి గ్రేడ్ చేసి అప్పర్ ప్రైమరీ పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మార్చడంతో కనీసం రవాణా సదుపాయం లేని ప్రాంతం నుంచి విద్యార్థులు నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న కొండపల్లికి వెళ్లలేక చదువు మానివేసే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి అడవి క్వారీ పాఠశాలను అప్పర్ ప్రైమరీ స్కూల్‌గా యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎంసీ చైర్మన్ అరుణ, తల్లిదండ్రులు కొండలరావు, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీసీ వసతిగృహంలో సమస్యలు పరిష్కరించాలి

విద్యార్థులు, తల్లిదండ్రుల ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

నూజివీడు: స్థానిక రామాయమ్మరావుపేటలోని బీసీ బాలుర కళాశాల వసతిగృహం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారులు వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సాయికుమార్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు డి.శివకుమార్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నూజివీడు పట్టణ సమితి ఆధ్వర్యంలో వసతిగృహం విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం హాస్టల్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు మూడు కిలోమీటర్ల మేర ర్యాలీ, కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ హాస్టల్‌లో వంట చేసి వడ్డించే వర్కర్లు లేక విద్యార్థులే స్వయంగా భోజనాలు తయారు చేసుకుని తినాల్సిన దుస్థితి నెలకొందన్నారు. వారానికి ఇద్దరు చొప్పున కైకలూరు ప్రాంతం నుంచి ఇక్కడికి డ్యూటీలు వేస్తున్నారని, వారు సకాలంలో రాక, కొందరు అసలు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సమస్య గత ఏడు నెలలుగా ఉన్నప్పటికీ పరిష్కరించడంలో స్థానిక ఏబీసీడబ్ల్యూఓ, జిల్లా స్థాయిలోని డీబీసీడబ్ల్యూఓ అలసత్వం వహిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులే స్వయంగా ఏలూరు వెళ్లి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తమ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన తరువాత మాత్రమే అధికారులు స్పందించారన్నారు. అయినా పర్మినెంట్‌గా వర్కర్లను నియమించకుండా వేరే ప్రాంతాల్లోని వర్కర్లను వారానికోసారి మారుస్తూ అందరిని ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఈనెల 2న కళాశాలలు ప్రారంభమైతే జూన్ 12 వరకు హాస్టల్ తెరవకుండా జాప్యం చేశారన్నారు. ఇప్పటికైనా హాస్టల్‌లో పర్మినెంట్ సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఎం.క్రాంతికుమార్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాలో 97 మందికి ఉద్యోగాలు

నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 97 మందిని పలు కంపెనీలు ఉద్యోగాలకు ఎంపిక చేశాయి. ఈ జాబ్ మేళాకు పలు ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు హాజరుకాగా 128 మంది నిరుద్యోగులు జాబ్‌మేళాలో పాల్గొన్నారు. జాబ్‌మేళాను ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ పైడిమాల రజిత ప్రారంభించారు. ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు హాజరైన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి ఇంటర్వ్యూలను నిర్వహించి ఎంపిక చేశారు.

## భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం మేలు

ముసునూరు: రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ శాఖాధికారి ఆలూరి చాముండేశ్వరి అన్నారు. రమణక్కపేట, లోపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌ఎస్‌కేల వద్ద భూసార పరీక్షల ఆవశ్యకత, మట్టి నమూనా సేకరించే విధానం, భూసార పరీక్షల వలన కలిగే లాభాలను రైతులకు వివరించారు. భూసారాన్ని పెంచుకునేందుకు పచ్చిరొట్ట విత్తనాలు, పీఎండీఎస్ కిట్ల రూపంలో ఉన్న నవ ధాన్యాలను చల్లుకొని పూత దశలో పంట చేనులో కలియదున్నాలన్నారు. వైస్ ఎంపీపీ కె.రాజానాయన, సర్పంచ్ ఆర్.ధనలక్ష్మి గాంధీ, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, వీహెచ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

## మైనర్లు డ్రైవింగ్ చేస్తే బైక్‌లు సీజ్ చేస్తాం

జగ్గయ్యపేట అర్బన్: ద్విచక్ర వాహనాలను మైనర్లు డ్రైవింగ్ చేస్తే సహించేది లేదని, వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు బైక్‌లు సీజ్ చేస్తామని పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని రైతుబజారు వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కూడలిలో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, డాక్యుమెంట్లు, లైసెన్స్‌లను తనిఖీ చేశారు. ర్యాష్ డ్రైవింగ్ చేసేవారిని, పెండింగ్ చలానాలు కట్టాల్సిన వారిని ఉపేక్షించేది లేదని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ట్రిపుల్ ఐటీ సీట్లకు విద్యార్థినుల ఎంపిక



పసుపులేటి నందిని



మందా స్నేహలత



దావా తనుశ్రీ యామిని



ఎం.సుష్మ



బెజవాడ సంజన

మైలవరం: 2024-25 విద్యా సంవత్సరానికి ప్రకటించిన ట్రిపుల్ ఐటీ సీట్లలో మైలవరం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్లస్‌కు చెందిన ముగ్గురు బాలికలు సీట్లు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.రాజశేఖర్ మంగళవారం తెలిపారు. తమ పాఠశాలకు చెందిన పసుపులేటి నందిని నూజివీడు ట్రిపుల్ ఐటీ, మందా స్నేహలత ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ, దావా తనుశ్రీ యామిని ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని చెప్పారు. విద్యార్థినులను హెచ్‌ఎంతోపాటు ఎస్‌ఎంసీ చైర్మన్ ఎం. బాబూరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

నూజివీడు: పట్టణంతో పాటు మండలంలోని పలు హైస్కూళ్లకు చెందిన పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు ట్రిపుల్‌ఐటీల్లో సీట్లు సాధించారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌కు చెందిన ఎం.సుష్మా, కాకి సులోచనలు నూజివీడు ట్రిపుల్ ఐటీలో, షేక్ షాహిన సుల్తానా ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, నాయుడు కావ్య, నాయుడు కవిత ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించారు. మండలంలోని దిగవల్లి హైస్కూల్‌కు చెందిన బెజవాడ సంజన ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించింది. వీరందరిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు అనురాధ, వై. సునీత, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

మూలపాడు(ఇబ్రహీంపట్నం): వ్యవసాయం, పశుసంవర్థక శాఖలకు అనుసంధానం చేసిన ఉపాధి హామీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. త్రిలోచనాపురం, మూలపాడు రైతు సేవా కేంద్రాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పథకాల్లో 90 శాతం సబ్సిడీతో గోకులం షెడ్లు, 70 శాతం సబ్సిడీతో కోళ్ల ఫారాలు, జీవాల షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. మండలానికి 50 గోకులం షెడ్లు మంజూరు అయ్యాయని చెప్పారు. పశుగ్రాసం సాగుకు సైతం అవకాశం ఉందన్నారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన వరి, పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై అందిస్తున్నామని చెప్పారు. సర్పంచి చింతల భూలక్ష్మి, నందిగామ పశుసంవర్థక శాఖ డివిజినల్ డెప్యూటీ డైరెక్టర్ మోజెస్ వెస్లీ, పశు వైద్యాధికారి శైలు మాధురి, ఏఓ రజని, రైతులు పాల్గొన్నారు.

## వరకట్న వేధింపులపై కేసు నమోదు

జి.కొండూరు: వరకట్న వేధింపులపై జి.కొండూరు పోలీసులకు వివాహిత ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..వెలగలేరు గ్రామానికి చెందిన మౌనికకు కొండపల్లికి చెందిన వల్లూరి సంపత్‌కుమార్‌కి మూడేళ్ల కిందట వివాహమైంది. వివాహ సమయంలో మౌనిక తల్లిదండ్రులు రూ.8 లక్షల నగదు, అల్లుడుకి ఏడు కాసుల బంగారం, కూతురుకి ఐదు కాసులు బంగారం కట్నంగా ఇచ్చారు. వివాహ సమయంలో సంపత్‌కుమార్ బీటెక్ చదివి ఉద్యోగం చేస్తున్నట్లు చెప్పాడు. కానీ వివాహం అనంతరం సంపత్‌కుమార్ బీటెక్ చదవలేదని, ఉద్యోగం కూడా సక్రమంగా చేయడం లేదని తెలిసింది. ఈ క్రమంలో ఉపాధి కోసం మౌనిక తన తల్లిదండ్రులకు చెప్పి మరో రూ.2 లక్షలు ఇప్పించి భర్తకు కారు కొని ఇచ్చింది. అయినప్పటికీ మరో కారు కొనేందుకు రూ.3 లక్షలు తీసుకురావాలంటూ సంపత్‌కుమార్ మౌనికను వేధించసాగాడు. అత్తమామలు సైతం వేధించడంతో చేసేదిలేక మౌనిక జి.కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మానసిక రోగులకు మెరుగైన వైద్య సేవలు

ముసునూరు: మానసిక రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని నోడల్ అధికారి డాక్టర్ ఆర్.రోహిత్ అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో మానసిక రోగులకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఆయన మాట్లాడుతూ నెలకోసారి రమణక్కపేట పీహెచ్‌సీలో వైద్య సేవలు అందిస్తామన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రమ్య, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## నారుమడులపై రైతులకు అవగాహన

ఆగిరిపల్లి: పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి భవాని అన్నారు. మంగళవారం బొద్దనపల్లి, కొత్త ఈదర గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నారుమడుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ నూతన సాగు విధానాల ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే పొలం పిలుస్తోంది కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. వరి నాట్లు వేసే ముందు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖాధికారి జ్యోతి ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

## రేపు ఉపాధి హామీ ప్రజావేదిక

తిరువూరురూరల్: మండలంలో గత ఏడాది జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై గ్రామ స్థాయిలో సామాజిక తనిఖీపై ఈ నెల 26న తిరువూరులో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ రవిబాబు తెలిపారు. సామాజిక తనిఖీలో గుర్తించిన అవకతవకలు, ఇతర అంశాలపై ఈ ప్రజావేదికలో నివేదించనున్నందున సంబంధిత శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు. ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com